# రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్, అక్టోబర్25: రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ మండలపరిధిలోని తుల్జారాంపేట్, గూడెంగడ్డ, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, మంతూర్, ఖాజీపేట్, తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధర అందించాలన్నారు. నర్సాపూర్ మండల వ్యాప్తంగా 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని చెప్పారు. దళారుల నుంచి రైతులను కాపాడడానికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా సన్న, దొడ్డ రకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వడ్లను కొలతలు వేసి మరీ సన్నాలుగా గుర్తిస్తున్నారని, బేషరుతగా అన్ని రకాల వడ్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులకు గన్నీ సంచులు, తాళ్లు, రవాణా సదుపాయాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో వైద్య శ్రీనివాస్, ఏపీఎం గౌరీశంకర్, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ఉమ్లానాయక్, సామ్యానాయక్, రామునాయక్, షేక్ హుస్సేన్, సేనాధిపతి తదితరులు పాల్గొన్నారు.


గూడెంగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి


చిలిపిచెడ్: బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

### కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

చిలిపిచెడ్, అక్టోబర్ 25: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలపరిధిలోని ఫైజాబాద్‌కు చెందిన తలారి రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి కుటుంబాలకు పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల ప్రమాదబీమా చెక్కును శుక్రవారం మృతుడి భార్య లక్ష్మికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మనోహరానర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లమ్మా సంగాగౌడ్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ రాంచంద్రారెడ్డి, విఠల్, శ్రీకాంత్‌రెడ్డి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపాల్‌రావు, సయ్యాద్ హుస్సేన్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# సర్వసభ్య సమావేశానికి హాజరైన శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, చిత్రంలో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 25: మున్సిపాల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలు, పాలకవర్గం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనుల గురించి శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. శుక్రవారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లు యోగేశ్‌కుమార్, హితేశ్ కండేల్‌వాల్, ఆశిష్‌కుమార్, మొహిబుల్ అన్సారి, సౌవిక్ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పాలకవర్గం స్వాగతిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎజెండా ప్రవేశపెట్టగా కౌన్సిల్ సమస్యలపై చర్చించారు. మెప్మా అధికారులు ప్రభుత్వ పథకాలను అమలు చేసే విషయంలో కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు కల్యాణి, జయశ్రీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. బోరు మోటర్ల మరమ్మతుల ఖర్చులు పేర్కొనడంలో స్పష్టత లేదని కౌన్సిలర్ కృష్ణారెడ్డి ఆరోపించారు. పట్టణంలో పందుల బెడద ఎక్కువైందని, వెల్‌కం బోర్డు నుంచి రేణుకాంబ ఆలయం వరకు వీధి దీపాలు మార్చి, వాటి స్థానంలో వెలుతురు ఎక్కువగా వచ్చే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. రాందాస్ చౌరస్తాలోని ప్రధాన రోడ్డు మధ్యలోని మ్యాన్‌హోల్ ధ్వంసమై ఏడాదికావస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదని, దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ జోక్యం చేసుకొని మరమ్మతులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలనని డీఈ మహేశ్‌ను ఆదేశించారు. మెప్మా పరిధిలో జరిగే ప్రభుత్వ పథకాలను కౌన్సిల్ సమావేశాలో తెలిపాలని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. పందులను తరలించే ఏర్పాట్లు చేస్తామని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని చైర్మన్ గౌరవ సభ్యులకు తెలిపారు. అనంతరం ఎజెండాలోని అంశాల గురించి శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లకు వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు సుంకయ్య, కిశోర్ లక్ష్మీనారాయణ గౌడ్, శేఖర్, వసంత్‌రాజ్, లింగం, సమీయొద్దీన్, లలిత, వనజ, దొంతి లక్ష్మి, గాయత్రి, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్

# విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు

## ఎంపీ రఘునందన్‌రావు

మెదక్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో 'వార్తాలాప్' వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..జర్నలిస్టులు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వార్తలు ప్రచురించాలన్నారు. విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని, జర్నలిస్టులు రాసే ప్రతి వార్త పేద వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడాలని పిలిపునిచ్చారు. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరగాలన్నారు. గ్రామీణ ప్రాంతల నుంచి మండల కేంద్రాలకు వచ్చే విద్యార్థినులు, మహిళలు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారని, ఇలాంటి వాటిపై వార్తలు రాసి సమాజానికి జర్నలిస్టులు మేలు చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జర్నలిజం చాలా పవిత్రమైందని, నిజమైన వార్తలు ప్రచురించాలని, సమాజంలో ఉన్న వివక్ష, మూఢనమ్మకాలు, సామాజిక బహిష్కరణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ప్రజలను చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్, శివ, చరణ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, డీపీఆర్వో రాంచంద్ర రాజు, బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యమివ్వాలి

## కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, దానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, వ్యవసాయ విస్తరణ, లివ్‌పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ విస్తరణ అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులతో ఆయిల్‌పామ్ విస్తరణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆయిల్‌పామ్ ఉత్పత్తిలో స్వయం సంమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తుందన్నారు. వరితో పోల్చుకుంటే రెట్టింపు ఆదాయం వస్తుందని, రైతులు కొత్త పంటలు సాగు చేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఏఈవోలు తమ వంతు బాధ్యతగా రైతులకు వివరించాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలపై రాయితీతోపాటు నాలుగేండ్ల తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు రూ.26,450లను రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 25: జిల్లా గ్రంథాలయంలో అవసరమైన నూతన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ గ్రంథాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలోని పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం పుస్తకాలను పరిశీలించి, వివిధ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పుస్తకాలను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గ్రంథాలయంలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని లైబ్రేరియన్‌కు సూచించారు.

### పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

మెదక్ రూరల్, అక్టోబర్ 25: పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయాలని కలెక్టర్ రాహూల్‌రాజ్ పశు వైద్యాధికారులకు సూచించారు. మెదక్ మండల పరిధిలోని మాచవరంలో పశు వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిల్వ గదిని, పశు వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మణ్, భానుచందర్ పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

# పెండింగ్ కేసులు పూర్తి చేయాలి

## ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

నర్సాపూర్, అక్టోబర్ 25: వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎస్సైలకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట్, చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన నేర రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..సీసీ కెమెరాలను అన్ని రద్దీ ప్రాంతాల్లో, సంస్థల్లో ఉండాలని ఆదేశించారు. 100 నంబర్‌కు వచ్చే కాల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, కాల్ వచ్చిన వెంటనే ఇన్‌టైమ్‌లో చేరుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆస్తికి సంబంధించిన నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో సైబర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట్, చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.



### వనదుర్గా ఆలయంలో పూజలు ప్రారంభం

పాపన్నపేట, అక్టోబర్ 25: మంజీరా వరదలు తగ్గడంతో వన దుర్గా మాత ఆలయంలో శుక్రవారం పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు శంకర శర్మ ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి అర్చన చేసి పూజాలు ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సింగూరు నుంచి మంజీరా నీరు మూడు రోజులుగా ఆలయం మీదుగా వెళ్లడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేశారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

మనోహరాబాద్, అక్టోబర్ 25: రెండు వారాలుగా మిషన్ భగీరథ తాగునీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి, కొనాయిపల్లి గ్రామాల్లో ఉదయం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...15 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎదురుగా నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. గ్రామానికి వచ్చే నీటిని పరిశ్రమలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. స్పందించిన మిషన్ భగీరథ అధికారులు శ్రీధర్, దివ్య రంగాయిపల్లి గ్రామానికి చేరుకొని మహిళలను సముదాయించారు. పరిశ్రమలకు వచ్చే నీరు, గ్రామాలకు వెళ్లే నీటికి సంబంధం ఉండదన్నారు. పైప్‌లైన్లలో లీకేజీలు, ఎయిర్ రావడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూస్తామని తెలిపారు.


రంగాయిపల్లిలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వెల్ఫేర్ అధికారి

# మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

రామాయంపేట, అక్టోబర్ 25: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హైమవతి అన్నారు. శుక్రవారం రామాయంపేట ప్రాజెక్టు సమావేశానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు శ్రద్ధతో పని చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పౌష్టికాహారం అందజేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన్నారుల బరువును రోజూ పరీక్షించాలని, బరువులో తేడా వస్తే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. అనంతరం హైమవతిని అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సీడీపీవో స్వరూప, సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### ధరణి సమస్యలు పరిష్కరించాలి

చిన్నశంకరంపేట, అక్టోబర్ 25: ధరణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నశంకరం పేట తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ధరణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆదాయ, నివాస, ధృవపత్రాలను అందజేయాలన్నారు. అనంతరం ఆమె కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

### శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి పునాది

మెదక్ అర్బన్, అక్టోబర్ 25: శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి పునాది అని మెదక్ పట్టణ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గీత జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం-డ్రగ్స్, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుంబిగించాలని పేర్కొన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

రామాయంపేట, అక్టోబర్ 25: రామాయంపేట మండలం దంతెపల్లి గ్రామంలో శనివారం వీరనారి, ఉద్యమ నాయకురాలు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ ఉంటుందని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెట్టు గంగారాం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రామాయంపేటలో మాట్లాడుతూ దంతెపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా ఆవిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి జిల్లాలో ఉన్న రజకసంఘం బాధ్యులతోపాటు బీసీ నాయకులు, పార్టీల కతీతంగా పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### స్వచ్ఛందంగా బంద్

పెద్దశంకరంపేట, అక్టోబర్ 25: హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పెద్దశంకరంపేట పట్టణంలో వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రామాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ జై శ్రీరామ్... జైజై శ్రీరామ్ అంటూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కోనం విఠల్ తదితరులున్నారు.

### రుస్తుంపేట్ సందర్శన

నర్సాపూర్, అక్టోబర్ 25: మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామాన్ని ట్రైనీ సివిల్ సర్వీసెస్ ఆఫీసర్లు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామ పటాన్ని వేసి గ్రామంలో ఏమేమి ఉన్నాయో తెలుసుకున్నారు. వీరితోపాటు ఎంపీడీవో మధులత, అధికారులు ఉన్నారు.

### మెరుగైన చికిత్స అందించాలి

రామాయంపేట, అక్టోబర్ 25: పాడి పశువులకు మెరుగైన చికిత్స అందించాలని శిక్షణ ఐఏఎస్‌ల బృందం పేర్కొంది. శుక్రవారం రామాయంపేట మండలం డి.ధర్మారంలో శిక్షణ కోసం వచ్చిన బృందం సభ్యులు గ్రామంలోని రేషన్ షాప్, పశు వైద్యశాల, అంగన్‌వాడీలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాజులుద్దీన్, ఎంపీవో రాజేందర్, ఏపీవో శంకర్, కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

### తపస్ ఉపాధ్యక్షురాలి ఎన్నిక

చిన్నశంకరంపేట, అక్టోబర్ 25: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మెదక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా యెన్నం మాధవి ఎన్నికయ్యారు. మండలంలోని మీర్జాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మాధవి ఎన్నికైనట్లు మెదక్ జిల్లా తపస్ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపారాణి, సుజాత తెలిపారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. తపస్ సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

### పోలీసులకు వ్యాసరచన పోటీలు

మెదక్ అర్బన్, అక్టోబర్ 25: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి సమాజంలో పోలీస్ ప్రతిష్టను మెరుగుపర్చడంలో పోలీసుల పాత్ర, ఎస్సై నుంచి పైస్థాయి అధికారి వరకు ధృడమైన శరీరంలో ధృడమైన మనస్సు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... వ్యాసరచన పోటీల్లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు ముగ్గురిని, ఎస్సై నుంచి పైస్థాయి అధికారి వరకు ముగ్గురిని ఎంపిక చేసి ఆరుగురు పేర్లు రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక అయిన పోలీస్ అధికారులకు సిబ్బందికి సర్టిఫికెట్, నగదు రివార్డు అందజేస్తారని పేర్కొన్నారు.

# వైద్యసేవలు మెరుగుపడాలి

నర్సాపూర్, అక్టోబర్ 25: ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేవలు మెరుగుపడాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా దవాఖానను, కౌడిపల్లిలోని సీహెచ్‌సీని కమిషనర్ అజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానల్లోని రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దవాఖానల్లో ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివదాయాల్, నర్సాపూర్ సూపరింటెండెంట్ పావనీ, డాక్టర్లు మిర్జా నజీమ్ బేగ్, రాజేశ్‌కుమార్, వంశీ, దవాఖానల సిబ్బంది ఉన్నారు.


నర్సాపూర్ దవాఖానలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వీరోజిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 25: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని వీరోజిపల్లి, భూర్గుపల్లి, శివయపల్లి, జంబికుంట, భూర్గుపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. దళారులకు ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసీబాయి, నారాగౌడ్, సంగమేశ్వర్, సంతోశ్‌కుమార్, రాములు, పెరుమాండ్ల గౌడ్, ఏపీఎం గోపాల్ తదితరులున్నారు.

### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

రామాయంపేట, అక్టోబర్ 25:ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బాదె చంద్రం, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయాలు జరపాలన్నారు. రైతులు తూకం వేసిన వారంరోజుల్లోనే డబ్బులను ప్రభుత్వం బ్యాంకులో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏసుగారి రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, సుందర్ సింగ్, డైరెక్టర్ పోచమ్మల ఐలయ్య, సీఈవో. నర్సింహులు, శ్రీనివాస్ ఉన్నారు.

### కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజాంపేట, అక్టోబర్ 25: మండలంలోని నందిగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామాయంపేట పీఏసీఎస్ డైరెక్టర్ నిర్మల శుక్రవారం ప్రారంభించారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రీతి, సంగుస్వామి, మాజీ ఎంపీటీసీ సురేశ్, ఉపసర్పంచ్ రాజం, రైతులు శ్రీను, గౌరయ్య, శ్రీనివాస్, రమేశ్, దాసు, నర్సింహులు ఉన్నారు.

# పరిశ్రమలో అగ్నిప్రమాదం

చిన్నశంకరంపేట, అక్టోబర్ 25: ప్రమాదవశాత్తు షార్టు సర్క్యూట్‌తో నిప్పంటుకొని ప్యాకింగ్ మెటీరియల్ దగ్ధమై, రూ.కోటి ఆస్తి నష్టం జరిగిన ఘటన చిన్నశంకరంపేట గ్రామ శివారులోని ఎల్‌మెటల్ మొలల పరిశ్రమలో శుక్రవారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట శివారులోని ఎల్‌మెటల్ మొలల పరిశ్రమలో ప్యాకింగ్ మెటీరియల్ నిల్వ ఉంచిన గోదాంలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన కార్మికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. వెంటనే మెదక్, రామాయంపేట అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రమాదంలో కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సందర్భంగా పరిశ్రమ యజమాని జైకిసాన్ మాట్లాడుతూ..ప్రమాదంలో సుమారు రూ. కోటి నష్టం వాటిల్లిందని తెలిపారు.


గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

# మెకానిక్ షెడ్డులో...

తూప్రాన్, అక్టోబర్ 25: తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న లిమా మోటార్స్ కార్ల మెకానిక్ షెడ్‌లో గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో షెడ్‌లో ఉన్న 9 వాహనాలు దగ్ధమయ్యాయి. బాధితులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపు యజమాని షోయల్ షెడ్డు మూసేసి ఇంటికి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే 9 వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కార్లు

### మనోవేదనతో మహిళ మృతి

పాపన్నపేట, అక్టోబర్ 25: ఫౌతీ కోస రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా అధికారులు కనికరించకపోవడంతో వికలాంగురాలైన తన తల్లి కన్ను మూసిందని పాపన్నపేట మండలంలోని ఆర్కెలా గ్రామానికి చెందిన మోహన, గౌరమ్మ, మణెమ్మ, వెంకటమ్మ ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..తన తండ్రి జన్మల వెంకటయ్య 23 నవంబర్ 2023లో మరణించాడని చెప్పారు. ఆయన పేర ఉన్న 18.5 గుంటల వ్యవసాయ భూమిని తన తల్లి దుర్గమ్మ పేరిట ఫౌతీ చేయాలని నెల రోజులుగా పాపన్నపేట తహసీల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. వికలాంగురాలైన తన తల్లి బుధవారం వరకు తిరిగి మనోవేదనకు గురై గురువారం రాత్రి మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. అధికారులపై తగిన చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా భూమి విస్తీర్ణంలో వ్యత్యాసం ఉండలం వల్ల ఫౌతీ చేయడంలో ఆలస్యం జరిగిందన్నారు.


బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడికి కేక్ తినిపిస్తున్న నాయకులు

# ఘనంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడి పుట్టినరోజు

రామాయంపేట, అక్టోబర్ 25: రామాయంపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు, మున్సిపాలిటీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తల మధ్య మున్సిపాలిటీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ చేతుల మీదుగా కేకు కట్ చేసి పట్టణాధ్యక్షుడు నాగరాజు బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొర్ర అనిల్, చింతల యాదగిరి, శ్యాంసుందర్, చింతల రాములు, నవాత్ మహేశ్, అస్నొద్దీన్, కృష్ణా గౌడ్, చిన్నరాజు తదితర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

WANTED
★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333979.
Medak-NT-98842